క్లుప్తంగా

జొన్న కొనుగోళ్లు బంద్

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో పీఏసీఎస్, మార్క్‌ఫెడ్ ద్వారా కొనసాగిన జొన్న కొనుగోలు కేంద్రాన్ని సోమవారంతో బంద్ చేసినట్లు పీఏసీఎస్ కార్యదర్శి ధరంసింగ్, పీఏసీఎస్ చైర్మన్ మారుతి డొంగ్రెలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు గమనించి జొన్న పంటను విక్రయానికి తీసుకురావద్దని కోరారు.

నేరడిగొండ: మండల కేంద్రంలో గల జొన్నల కొనుగోలు కేంద్రంలో ఈనెల 31 నుంచి కొనుగోళ్లు నిలిపివేయనున్నట్లు పీఏసీఎస్ సెంటర్ ఇన్‌చార్జి బారే నాగభూషణం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు తమ పంటను సాయంత్రం 5 గంటల లోపు మార్కెట్‌కు తీసుకురావాలని కోరారు. ఆ తర్వాత పంటను కేంద్రంలో విక్రయించడానికి అవకాశం ఉండదన్నారు.

వైద్య పరీక్షలు చేయించుకోవాలి


మందులు అందజేస్తున్న వైద్య సిబ్బంది

నేరడిగొండ: ప్రజలు వైద్య పరీక్షలు చేయించుకోవాలని హెల్త్ సూపర్‌వైజర్ సంతోష్ అన్నారు. సోమవారం మండలంలోని గాజిలి గ్రామంలో ఎన్‌సీడీ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక రక్తపోటు, మధుమేహంతో పాటు ఇతర వ్యాధుల నిర్ధారణ కోసం చేపట్టే స్క్రీనింగ్ పరీక్షల కోసం స్వచ్ఛందంగా ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ వైష్ణవి, హెల్త్ అసిస్టెంట్ సాయన్న, ఏఎన్ఎం రాణి, ఆశ కార్యకర్త భానుప్రియ పాల్గొన్నారు.

కేబుల్ ఆపరేటర్లు చార్జీలు చెల్లించాలి

ఆదిలాబాద్‌టౌన్: విద్యుత్ స్తంభాలకు కేబుల్స్ అమర్చిన డిష్, ఇంటర్నెట్ కేబుల్ ఆపరేటర్లు చార్జీలు చెల్లించాలని విద్యుత్ శాఖ ఎస్ఈ జేఆర్ చౌహాన్ అన్నారు. సోమవారం కేబుల్ డిష్ ఆపరేటర్లతో తన చాంబర్‌లో సమావేశం నిర్వహించారు. విద్యుత్ స్తంభాలకు ఇష్టారీతిన వైర్లు వేలాడదీయకుండా క్రమపద్ధతిలో అమర్చాలని సూచించారు. ఎన్ని పోల్స్‌కు కేబుల్స్ అమర్చారో పూర్తి వివరాలను రాతపూర్వకంగా రాసి ఇవ్వాలన్నారు. డబ్బులు చెల్లించని వారి వైర్లను తొలగిస్తామని పేర్కొన్నారు.

'మహిళలు అప్రమత్తంగా ఉండాలి'

ఆదిలాబాద్‌టౌన్: యువతులు, మహిళలు అప్రమత్తంగా ఉండాలని ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి డాక్టర్ సునీత అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని అర్బన్ కేజీబీవీలో మోడల్‌స్కూల్, యూఆర్ఎస్, కేజీబీవీల్లో పనిచేసే ఉద్యోగులకు మానవ అక్రమ రవాణాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ యువతులు సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడొద్దన్నారు. జిల్లా విద్యా శాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి, విద్య శాఖ సెక్టోరియల్ అధికారి ఉదయ్‌శ్రీ, సిరాజ్ అమాన్, కేజీబీవీ ప్రత్యేక అధికారి దీప్తి తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

ఇచ్చోడ: నకిలీ విత్తనాలు విక్రయించే డీలర్లపై చట్టరీత్య చర్యలు తీసుకుంటామని మండల ఇన్‌చార్జి వ్యవసాయాధికారి రమేశ్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని విత్తన దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులు అడిగిన విత్తనాలనే అందించాలన్నారు. రైతులపై విత్తన డీలర్లు ఒత్తిడి పెంచవద్దని, రైతులకు విత్తనాల రశీదులు ఇవ్వాలన్నారు. లైసెన్స్‌లు ఉన్న డీలర్ల వద్దే రైతులు విత్తనాలు కొనుగోలు చేయాలని, గ్రామాల్లో విక్రయిస్తున్న వ్యాపారుల వద్ద విత్తనాలు కొనుగోలు చేసి మోసపోవద్దని సూచించారు. తనిఖీల సందర్భంగా విత్తన నమూనాలు సేకరించినట్లు తెలిపారు. సేకరించిన విత్తన నమూనాలను ప్రోటీన్ నాణ్యత శాతం కోసం హైదారాబాద్‌కు పంపనున్నట్లు పేర్కొన్నారు.

రోడ్డు మరమ్మతులు చేపట్టాలి

ఇంద్రవెల్లి: మండలంలోని వడగామ్ గ్రామం మీదుగా ఉన్న రింగ్‌రోడ్డు గుంతలు ఏర్పడి అధ్వానంగా మారిందని, రోడ్డు మరమ్మతులు చేపట్టాలని వడగామ్ గ్రామస్తుడు ఆత్రం మహేశ్వర్ కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ రాజర్షిషాకు వినతిపత్రం అందించారు.

విద్యుత్‌షాక్‌తో కూలీకి గాయాలు

బజార్‌హత్నూర్: విద్యుత్‌షాక్‌తో కూలీకి గాయాలయ్యాయి. మండలంలోని చందు నాయక్‌తండాలో జెడ్పీ సెకండరీ పాఠశాలకు సోమవారం రంగులు వేయడానికి ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రం మహరాజ్‌గంజ్ జిల్లా నుంచి కూలీలు గ్రామానికి వచ్చారు. అందులో సోనుసింగ్ టేబుల్‌పై నిల్చొని గోడలకు రంగులు వేస్తున్నాడు. ఆ గోడలకు విద్యుత్ సరఫరా కావడంతో సోనుసింగ్ తగిలి కిందపడ్డాడు. వెంటనే పీహెచ్‌సీలో చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం అంబులెన్స్‌లో ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు.

కేజీబీవీ సిద్ధం..!

- ఎట్టకేలకు భవన నిర్మాణం పూర్తి
- ఈసారి తరగతులు ప్రారంభం
- సొంత భవనంతో తీరనున్న కష్టాలు


నూతనంగా నిర్మించిన కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం

భీంపూర్: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ భవన నిర్మాణ పనులు ఎట్టకేలకు పూర్తయ్యాయి. అద్దె భవనంలో కొనసాగుతున్న తరగతులు ఈ విద్యా సంవత్సరం నుంచి సొంత భవనంలోకి మారుస్తుండడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

2015లో మంజూరు..

గత ప్రభుత్వం 2015లో మండల కేంద్రానికి కేజీబీవీ మంజూరు చేసింది. అప్పటి నుంచి గత సంవత్సరం వరకు జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాలలోని అద్దె భవనంలో విద్యార్థినులు అసౌకర్యాల మధ్య కాలం వెళ్లదీశారు. భవన నిర్మాణానికి రూ.3.5 కోట్ల నిధులు మంజూరు చేయగా మూడేళ్లకు పైగా కొనసాగిన భవన నిర్మాణ పనులు ఎట్టకేలకు పూర్తయ్యాయి.

అద్దె భవనంలో తిప్పలు..

ఇన్నాళ్లుగా అద్దె భవనంలో మౌలిక వసతులు లేక ఇరుకైన గదులలో విద్యా బోధన కొనసాగడంతో విద్యార్థినుల బాధలు వర్ణనాతీతంగా ఉండేవి. కేజీబీవీ మండలానికి సుదూరంలో ఉండటంతో సెలవుల సమయంలో పిల్లలను కలిసేందుకు తల్లిదండ్రులకు సైతం ఇబ్బందిగా ఉండేది. సమీప ప్రాంతంలోనే అన్ని రకాల సౌకర్యాలతో కేజీబీవీ భవన నిర్మాణం పూర్తయ్యి ఈ విద్యా సంవత్సరం నుంచే తరగతులు ప్రారంభమవుతుండడంతో ఇటు విద్యార్థులు, అటు తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

దరఖాస్తు చేసుకోవాలి..



కేజీబీవీ నిర్మాణ పనులు పూర్తయిన నేపథ్యంలో 2025 –26 విద్యా సంవత్సరంలో నూతన భవనంలో తరగతులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నాం. 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదివే బాలికలు కేజీబీవీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలి. మూడు ఎకరాల సువిశాల నూతన భవనంలో తరగతి గదులు, వసతితో పాటు, ఆట స్థలం, లైబ్రరీ, పలు మౌలిక వసతులు ఏర్పాటు చేశాం.

– రజినీ, కేజీబీవీ ప్రత్యేకాధికారి, భీంపూర్

పారిశుద్ధ్య పనులు చేపట్టాలి


ఇచ్చోడ: రోడ్డు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌జాదవ్


నేరడిగొండ: చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

ఇచ్చోడ: రోడ్లపై మురికి నీరు ప్రవహించకుండా అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అధికారులను ఆదేశించారు. మండలంలోని అడేగామ బికు వెళ్లే రోడ్డులో పోలీస్‌స్టేషన్ ముందు గత కొన్ని రోజుల నుంచి రోడ్డుపై మురికి నీరు ప్రవహిస్తుండటంతో కాలనీవాసులు విన్నపం మేరకు ఆయన సోమవారం పరిశీలించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల కన్వీనర్ ఏనుగు కృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ నిమ్మల ప్రీతంరెడ్డి, మాజీ సర్పంచ్ ముండే పాండురంగ్, ఉపసర్పంచ్ లోక శిరీష్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, సర్పడే రమేశ్, సాబీర్ ఉన్నారు.

ఆటో డ్రైవర్ల పక్షాన నిలబడతాం

నేరడిగొండ: ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ కొట్లాడుతుందని, ఆటో డ్రైవర్ల పక్షాన నిలబడతామని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. ఆటో జేఏసీ నాయకులు సోమవారం ఎమ్మెల్యేను మండల కేంద్రంలోని ఆయన నివాసంలో కలిశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మెనిఫెస్టోలో ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ ఈనెల 27న హైదరాబాద్ ఇందిరా పార్కులో జరగనున్న ఆటో ఆకలి కేకల మహాసభకు అండగా నిలవాలని కోరారు. ఎమ్మెల్యే రూ.5వేలు విరాళంగా అందజేసి మహాసభ పోస్టర్లు ఆవిష్కరించారు.

పోస్టర్ ఆవిష్కరణ

తెలంగాణ కోసమే తెలంగాణ జర్నలిస్టులు నినాదంతో తెలంగాణ జర్నలిస్టు ఫోరం ఆధ్వర్యంలో ఈనెల 31న హైదరాబాద్‌లోని జల విహార్‌లో నిర్వహిస్తున్న 25 వసంతాల రాజతోత్సవాల సంబురాల పోస్టర్‌ను సోమవారం మండల కేంద్రంలో అనిల్ జాదవ్ ఆవిష్కరించారు. స్వరాష్ట్ర సాధన కోసం జర్నలిస్టులు పిడికిలి బిగించి తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు బేత రమేశ్, ఎల్.రాజు, ఎం.సంతోష్, ఆర్.సుభాష్, శోభన్ రెడ్డి, కొప్పుల ప్రమోద్, గాజుల దేవేందర్ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్‌తో పేదలకు మేలు

ఆరోగ్య సమస్యలతో బాధపడుతూ ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందిన వారికి సీఎంఆర్ఎఫ్ పథకం ఎంతో మేలు చేస్తుందని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను సోమవారం మండల కేంద్రంలోని ఆయన నివాసంలో అందజేశారు. రాథోడ్ సజన్, శ్రీధర్ రెడ్డి, డాక్టర్ స్వామి, పెంటన్న, రోహిదాస్, ప్రవీణ్, మహేందర్, రఫీ, భూషణ్, అనిల్, అర్జున్ పాల్గొన్నారు.

భీంపూర్: మండలంలోని పిప్పల్‌కోటి గ్రామానికి చెందిన పెద్దింటి భూమన్నకు మంజూరైన రూ.42 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆదేశానుసారం బీఆర్ఎస్ నాయకులు సోమవారం అందజేశారు. షేక్ అఫ్రోజ్, భూమన్న, ఉదయ్ తదితరులు ఉన్నారు.

అటవీ అధికారులపై చర్య తీసుకోవాలి

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

ఉట్నూర్‌రూరల్: షెడ్యూల్ ప్రాంతంలో పోడు భూముల సాగును అడ్డుకుని గిరిజనులను భయభ్రాంతులకు గురి చేస్తున్న అటవీశాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. సోమవారం స్థానిక క్యాంప్ కార్యాలయంలో ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పోడు భూముల సాగును అడ్డుకోవడంతో పాటు ఎఫ్‌డీపీటీ శాంతారాం, ఉట్నూర్ ఎఫ్‌డీవో రేవంత్ చంద్ర సిబ్బందితో కలిసి దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇటీవల హైదరాబాద్‌లో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, అటవీశాఖ మంత్రి సురేఖలు అభివృద్ధి, పోడు భూముల సాగుపై సహకరించాలని తెలిపినా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వ పనులు అడ్డుకోవడమే కాకుండా, ప్రభుత్వాన్ని బదనాం చేస్తున్నారని, వెంటనే వీరిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు ఖయ్యూం, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు చంద్రయ్య, మర్సుకోల తిరుపతి, జగదీశ్ జాదవ్, ఎక్బాల్, అజీం, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

కొడప లక్ష్మణ్ మృతి బాధాకరం..

అడవి పంది దాడిలో కొడప లక్ష్మణ్ మృతి చెందటం బాధాకరమని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. సోమవారం ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి అడవి పంది దాడిలో మృతి చెందిన లక్ష్మణ్ మృతదేహాన్ని పరిశీలించారు. అంబులెన్స్‌లో మృతదేహాన్ని తరలించి అంత్యక్రియలకు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. రోడ్డు సౌకర్యం లేని కారణంగా లక్ష్మణ్ అడవి పంది దాడిలో మృతి చెందాడని దీనికి ఫారెస్ట్ అధికారులే కారణమని ఆరోపించారు.

భూమిపూజ..

మండలంలోని బీర్సాయిపేట గ్రామంలో రూ. 18 లక్షలు, దంతన్‌పల్లి గ్రామంలో రూ.25 లక్షలతో చేపడుతున్న చెరువు మరమ్మతు పనులకు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు సోమవారం భూమిపూజ చేశారు.

రోడ్డు మరమ్మతులు చేపట్టరూ..!


పల్లి(కె) గ్రామ సమీపంలో రోడ్డుపై గుంతలలో నిలిచిన వర్షపు నీరు

తలమడుగు: బరంపూర్ గ్రామ ఎక్స్‌రోడ్ నుంచి పల్లి(కె) గ్రామానికి వెళ్లే రోడ్డు పూర్తిగా గుంతలమయమై అధ్వానంగా మారింది. గతంలో కాంట్రాక్టర్ మొరం వేసి వదిలేయగా మొరం పూర్తిగా కొట్టుకుపోయి గుంతలు ఏర్పడ్డాయి. గుంతల కారణంగా వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు గుంతలమయం కావడంతో ఆర్టీసీ బస్సు కూడా గ్రామానికి రావడం లేదు. దీంతో గ్రామస్తులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

దరఖాస్తుల పరిశీలన వేగవంతం చేయాలి

నార్నూర్: రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ వేగవంతం చేయాలని ఎంపీవో సాయిప్రసాద్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు దరఖాస్తుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదును పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ బ్యాంకుల వారీగా సిబిల్ చెక్ చేయడంతో పాటు అర్హుల జాబితాను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట సీనియర్ అసిస్టెంట్ నవీన్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

టీజేఎఫ్ రజతోత్సవ పోస్టర్ ఆవిష్కరణ

గుడిహత్నూర్: తెలంగాణ సాధనలో ఆవిర్భించిన తెలంగాణ జర్నలిస్టు ఫోరం రజతోత్సవాన్ని హైదరాబాద్‌లో ఈ నెల 31న నిర్వహిస్తున్నామని, కార్యక్రమానికి జర్నలిస్టులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు బేత రమేశ్ కోరారు. స్థానిక ప్రెస్‌క్లబ్ సభ్యులతో కలిసి ఆయన 'హలో రిపోర్టర్.. చలో హైదరా బాద్' అనే నినాదంతో పోస్టర్ ఆవిష్కరించారు. సంఘం ప్రధాన కార్యదర్శి ఎల్.రాజు, సభ్యులు సుభాష్, సంతోష్, రవీందర్, శ్రీను, సతీశ్ తదితరులు ఉన్నారు.

రైతు గుర్తింపు కార్డులకు దరఖాస్తు చేసుకోవాలి


మాట్లాడుతున్న ఏఈవో కృష్ణపాల్

బజార్‌హత్నూర్: పట్టాపాసు పుస్తకం ఉన్న ప్రతీ రైతు గుర్తింపు కార్డుకు దరఖాస్తు చేసుకోవాలని ఏఈవో కృష్ణపాల్ తెలిపారు. సోమవారం మండలంలోని పిప్రి రైతువేదికలో ఏర్పాటు చేసిన రైతు అవగాహన సదస్సులో పిప్రి, వర్తమన్నూర్, గిర్నూర్, మోహద, ఎల్లయ్యపల్లి, కాండ్లి, కనకదుర్గ గ్రామాల రైతులకు రైతు గుర్తింపు కార్డుపై అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న డిజిటల్ అగ్రికల్చర్ మిషన్ పథకంలో భాగంగా అగ్రిస్టాక్ పేరుతో దేశవ్యాప్తంగా ఉన్న రైతులకు రైతు గుర్తింపు కార్డులు ఇచ్చే కార్యక్రమం చేపట్టిందని తెలిపారు. డిజిటలైజేషన్‌తో భవిష్యత్తులో రైతులకు కేంద్ర ప్రభుత్వ పథకాలు అందించడం సులువుగా మారుతుందని తెలిపారు. గుర్తింపు కార్డుతో రైతుకు సంబంధించిన సాగుభూమి వివరాలు, నేల రకం, సాగుచేస్తున్న పంటల వివరాలు, ఆధార్‌కార్డు లింకు, బ్యాంకు ఖాతా, ఫోన్‌నంబర్ లింక్ చేయడం ద్వారా రైతు పూర్తి వివరాలు నిక్షిప్తమై ఉంటాయని తెలిపారు.

'చలో వరంగల్' పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: పద్మశ్రీ అవార్డు అందుకుని ఢిల్లీ నుంచి వరంగల్‌కు విచ్చేస్తున్న మందకృష్ణ మాదిగకు స్వాగతం పలకడానికి చేపట్టిన చలో వరంగల్ కార్యక్రమం పోస్టర్‌ను సోమవారం జిల్లా కేంద్రంలో ఆవిష్కరించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆరెల్లి మల్లేశ్‌మాదిగ మాట్లాడుతూ మందకృష్ణ మాదిగకు ఘన స్వాగతం పలకడానికి ఎమ్మార్పీఎస్ జాతీయ, రాష్ట్ర కమిటీల పిలుపు మేరకు కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. జిల్లావ్యాప్తంగా ఉన్న ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల నాయకులు పెద్ద ఎత్తున వరంగల్ రైల్వే స్టేషన్‌కు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు వినయ్ సాగర్, ఇండ్ల ఎల్లన్న మాదిగ, ఆరేపల్లి గణేశ్ మాదిగ, గుర్రాల ఆశన్న మాదిగ, కొల్లూరి కృష్ణ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

ఇతరుల దుకాణాలు తొలగించాలని వినతి


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఉట్నూర్‌రూరల్: తరతరాలుగా కుల వృత్తిని నమ్ముకొని జీవిస్తున్నామని ఇతరులు వేరే రాష్ట్రాల నుంచి వచ్చి ఇక్కడ దుకాణాలు పెట్టడంతో ఉపాధి దొరకకుండా పోతుందని నాయీబ్రాహ్మణ సేవా సంఘం ఉట్నూర్ మండల అధ్యక్షుడు గర్షకుర్తి వెంకటేశ్ పేర్కొన్నారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జును కలిసి వినతిపత్రం అందించారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి ఇక్కడ తమ కులవృత్తి చేస్తున్న దుకాణాలను తొలగించాలని వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పుండలి శ్రావణ్, నవీన్, రమణ, గంగాధర్, రమణ, మహేశ్, మల్లేశ్, నారాయణ, వెంకటేశ్, దేవయ్య, శ్రీను, తిరుపతి, సచిన్, రవి, సాయి ఉన్నారు.

రైతులు పంట మార్పిడి పాటించాలి


రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

ఇంద్రవెల్లి: శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారుల సూచనలు పాటించి పంటలు సాగు చేయాలని ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు డా.బి. రాజేశ్వరి, డా.జి. మంజులత అన్నారు. సోమవారం మండలంలోని గౌరపూర్ గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తల కార్యక్రమానికి హాజరయ్యారు. యూరియా వాడకం, అవసరం మేరకు రసాయన మందుల వినియోగం, కొనుగోలు చేసిన ఎరువులు, పురుగు మందులు, గడ్డి మందుల రశీదులు భద్రపర్చడంపై రైతులకు అవగాహన కల్పించారు. విత్తన శుద్ధి, పంట మార్పిడి, అంతర్గత పంటలపై దిగుబడి విధానాలపై అవగాహన కల్పించారు. వ్యవసాయ అధికారి రాథోడ్ గణేశ్, ఉద్యానవన అధికారి క్రాంతికుమార్, పశువైద్యాధికారి డా.విజయ్‌కుమార్, ఆయా గ్రామాల రైతులు తదితరులు ఉన్నారు.

జొన్న వాహనాల జాతర



ఇచ్చోడ: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డు సోమవారం జొన్న వాహనాలతో కిక్కిరిసిపోయింది. జొన్నల కొనుగోలుకు సోమవారం చివరిరోజు కావడంతో మార్కెట్‌యార్డుకు జొన్న రైతులు పోటెత్తారు.

కుమురంభీం చౌక్ కుదింపు

కైలాస్‌నగర్: బల్దియా అధికారుల అనాలోచిత నిర్ణయంతో లక్షలాది రూపాయల ప్రజాధనం వృథా అవుతోంది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు రూ.90లక్షలు వెచ్చించి ఆదిలాబాద్ పట్టణంలోని కుమురంభీం చౌక్‌ను సుందరీకరించారు. చౌక్ వెడల్పు ఎక్కువగా ఉండటం, రోడ్డు విస్తీర్ణం తక్కువగా మారడంతో ఇటీవల తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. దీంతో కూడలి వెడల్పు కుదించాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ బల్దియా అధికారులను ఆదేశించారు. ఈ మేరకు చౌక్ వెడల్పును కుదించే చర్యలను చేపట్టిన బల్దియా అధికారులు రూ.5లక్షల వ్యయంతో సోమవారం పనులు ప్రారంభించారు. చౌక్ చుట్టూ ఏడు ఫీట్ల వరకు వేసిన టైల్స్‌ను పూర్తిగా తొలగించారు. చౌక్ నలువైపులా ఏడు అడుగుల విస్తీర్ణం మేర చౌక్ వెడల్పు తగ్గనున్నట్లు అధికారులు చెబుతున్నారు.

సాంగ్వి గ్రామస్తుల నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

కైలాస్‌నగర్: విద్యుత్‌శాఖ అధికారుల తీరును నిరసిస్తూ జైనథ్ మండలంలోని సాంగ్వి–కే గ్రామస్తులు సోమవారం ఆందోళన చేపట్టారు. కలెక్టరేట్ సమావేశ మందిరం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలో వ్యవసాయ భూముల్లోని కరెంట్ స్తంభాలు వంగి, వైర్లు వేలాడుతుండడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. ఇటీవల 11కేవీ విద్యుత్ వైర్ తగిలి ప్రాణాపాయం నుంచి బయటపడ్డ రాకేశ్‌రెడ్డి అనే రైతు దివ్యాంగుడిగా మారాడన్నారు. వారం క్రితం దామోదర్ అనే రైతు విద్యుత్ షాక్‌తో మృతి చెందాడని తెలిపారు. అలాగే ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఓ రైతు ఎద్దులు మృత్యువాత పడ్డాయని పేర్కొన్నారు. అధికారులు స్పందించి బాధిత కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. విఠల్‌రెడ్డి, నితిన్, సాయి కిరణ్, ప్రవీణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడులు

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్‌రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధి బెల్లూరి గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు సోమవారం దాడి చేసి ఏడుగురు పేకాట ఆడుతున్న వారిని అరెస్టు చేసినట్లు రూరల్ సీఐ కె.ఫణిధర్ అన్నారు. వారి వద్ద నుంచి ఐదు మొబైల్‌ఫోన్లతో పాటు రూ.28,140 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పేకాట ఆడిన నాగేశ్, జె.శ్రీను, ఎన్.రాకేశ్, జె.రవితేజ, ఎస్.కే.రిజ్వాన్, ఎస్.ప్రసాంత్, టి.రవీందర్‌లపై కేసు నమోదు చేశామన్నారు.

చట్టాలు దుర్వినియోగం చేస్తే చర్యలు

ఇంద్రవెల్లి: ఏజెన్సీ చట్టాలను దుర్వినియోగం చేస్తూ వసూళ్లకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఉట్నూర్ సీఐ మొగిలి హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రంలోని స్థానిక పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఐ మొగిలి తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని గౌరపూర్ గ్రామ పంచాయతీ పరిధి రూప్‌సింగ్‌తండా గ్రామానికి చెందిన సాబ్లే మానిక్‌చంద్ మండలంలోని దనోరా (బి) గ్రామంలో ఇంటి నిర్మాణ పనులు చేస్తుండగా.. తలమడుగు మండలం చేర్లపల్లి గ్రామానికి చెందిన నైతం బాలు వెళ్లి ఇంటి నిర్మాణ పనులను ఆపి ఐటీడీఏ కోర్టులో ఫిర్యాదు చేసి ఎల్టీఆర్ కేసు నమోదు చేశారు. అనంతరం రూ. 5లక్షల డబ్బులు ఇస్తే కేసు వాపస్ తీసుకుంటానని డిమాండ్ చేశాడు. మానిక్‌చంద్ మే, 2022లో రూ.3 లక్షలు అప్పగించి కేసు వాపస్ తీసుకోవాలని కోరారు. అయితే కేసు వాపస్ తీసుకోకపోవడంతో అధికారులు భవన నిర్మాణ పనులు ఆపి కేసు నమోదు చేసి ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకున్నారు. అయితే సాబ్లే మానిక్ చంద్ బాలు డబ్బులు తీసుకుని మోసం చేసినట్లు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా నైతం బాలును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. అతనితో పాటు ఇటీవల రిమాండ్‌కు తరలించిన బిపిన్‌కుమార్, మెస్రం ఆనంద్‌రావులపై కూడ కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

క్షతగాత్రుల ప్రాణాలు కాపాడాలి


కేక్ కట్ చేస్తున్న రాజశేఖర్

ఆదిలాబాద్‌టౌన్: ప్రమాదాల్లో గాయపడ్డ క్షతగాత్రుల ప్రాణాలను కాపాడాలని 108 జిల్లా కోఆర్డినేటర్ రాజశేఖర్ అన్నారు. సోమవారం అంతర్జాతీయ పైలెట్ డే సందర్భంగా జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆవరణలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 108 అంబులెన్స్ సిబ్బంది ఆపత్కాలంలో అండగా నిలుస్తూ బాధితుల ప్రాణాలను కాపాడడంలో ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. సకాలంలో బాధితులను ఆస్పత్రికి చేర్చాలని సూచించారు. పైలెట్‌లు వసీమ్, విఠల్‌గౌడ్, రాములు, రమేశ్, నవీన్, పాండురంగ్, రుషికుమార్, శివకుమార్, ముజఫర్, పవార్ బాబు, లఖన్, శివ తదితరులు పాల్గొన్నారు.